సత్యమేవ జయతే (?)

# నిజం దాగదూ?

"హితశ్రీ"

షావుకారుకి వడ్డబాపతు పైకం ఇవ్వటానికి

రాఘవయ్య అలమారు తెరిచి, "అయ్య బాబో" అని ఓ గావుకేక వేశాడు. ఆ కేకకి ఇంటిల్లిపాదీ ఒక్క ఉరుకున అక్కడికి చేరుకున్నారు. రాఘవయ్య పెళ్ళాం చేత్తో ఓ చెప్పు పట్టుకొచ్చి, "తేలేనా? ఏదీ? ఎక్కడ? బాగా కాటేసిందా?" అంటూ అలమారంతా వెదకటం ప్రారంభించింది.

"తేలు కాదే ఎర్రిమొగమా, వందరూపాయల కాయితం పోయిందే" అన్నాడు రాఘవయ్య.

"వందరూపాయల కాయితమే! పోవటమే! అయ్య బాబో, ఇంకేముంది" అని రుద్ధకంఠంతో అంది రాఘవయ్య పెళ్లాం.

రాఘవయ్య ఆర్థిక పరిస్థితుల్నిబట్టి; వంద రూపాయలు పోవటమంటే అతనికి కొన్ని వేలు పోయినట్టే. గాభరా కాస్త తగ్గింతరవాత ఆ నోటు పోవటం ఎలా సంభవించిందో, తస్కరించినవాడు ఎవరై ఉండొచ్చో ఆరాలు తియ్యటం ఆరంభించాడు రాఘవయ్య. చివరికి ఈపని చేసింది తన పక్కింటివాడైన రామయ్య తప్ప మరొకడై ఉండడని తేల్చేసుకున్నాడతను. అనుమానం కలిగి అది స్థిరపడ్డ తరవాత ముందు వెనకలు చూసేమనిషి కాకపోవటంవల్ల రాఘవయ్య సరాసరి రామయ్య ఇంటికి వెళ్ళి అతన్ని నిలదీశాడు. రామయ్య ససేమిరా తనకీ విషయం ఏమీ తెలియదన్నాడు. రాఘవయ్య డబాయింపులకి లొంగే మనిషి కాదు.

"నువ్వు అనవసరంగా బొంకి లాభం ఏమీ లేదు. పెద్దమడిసి తరహాగా ఆ నోటు తిరిగిస్తినా సరే, లేకపోతే"

"ఇదుగో రావయ్యా, నాకు తిక్కరేగుద్ది! నేనేం బందిపోటు ననుకుంటుండ వేంది?"

"డబాయిస్తే తోకముడుచుకు పోతానను కుంటుండవేంది? ఇయ్యాల పొద్దున నువ్వొచ్చే ముందు వందరూపాయల కాయితం ఈ కళ్లతో అలమారులో సూసినా. నువ్వేదో పెద్దమడిసివి గదాని ఇంటోకిపోయి బువ్వ తినొద్దామని ఎల్లాను. నువ్విట్టా పుట్టి ముంచుతవని నే నెన్నడూ..."

"అద్దదే. మాటలు మిగుల్తుండవు. నేనేం కూటికి లేనోణ్ణి అనుకుంటుండవేంది నీ పాపిష్టి డబ్బు కక్కుర్తిపట్టానికి?"

"అయితే ఇయ్యవన్న మాట."

"ఎహె. నీగ్గాదూ సెప్పేది. నీ డబ్బు నే దమ్మిడీ ఎరగను. ఇంకా మంచోణ్ని గనక నెమ్మదిగా సెప్పుతుండా. ఇంకీపాటికి మల్లు."

"మల్లుతా, మల్లుతా. నిజం దాగుద్దీ! ఆ పోలీసోళ్లు రావాల, నిజం బయటపడాల. ఇయ్యి మంచికి రోజులుకావు."

రాఘవయ్య విసురుగా పోలీస్ స్టేషన్ వైపు బయలుదేరాడు. రామయ్య కోపంగా, చిరాకుగా పక్కమంచం మీద మేను వాల్చాడు.

"పోలీసోళ్ళని పిల్చుకొత్తాడు గామాల." అంది లచ్చి రామయ్యవైపు చూసి.

"పోలీసోళ్లు రానీ, ఆళ్ళ బాబులు గానీ. మనం తీత్తేగదా మనకి బయం."

"పరాచికానిగ్గాని నువ్వు తియ్యలేదు గందా" అంది లచ్చి రామయ్యవైపు బెదురుగా చూసి.

"ఏందీ! నువ్వు కూడా అనుమానిస్తుండవా? ఇయ్యాల పొద్దున్నే లేచి ఎవురి మొకం చూశానో గాని..."

"అదిగాదు. ఊరికేనే మనసుండబట్ట కన్నానయ్యా- అంత ఇదవుతవెందుకు?"

"పాణం పోయినా పరాయోళ్ళ సొమ్ము ముట్టననుకో. నా గుణం నీకు తెల్దా లచ్చి?"

"ఎందుకు తెల్దు?" అంది లచ్చి తృప్తిగా.

* * *

"ఇసిత్రంగుండది. ఎట్టా పోయింటుందబ్బా!"

"బయటోళ్లు ఎవురు తియ్యగల్రు? ఇంటి దొంగని ఈశ్వరుడయినా పట్టలేరంటరు."

"అంతేగావాలె. అయినా రాఘవయ్య పెద్ద బాపాయి బుద్ధి ఎవరికి తెలీదు?" అని జరిగిన చోరీలో రామయ్య తన అభిప్రాయ సూచనగా ఇచ్చి ఆ సంగతి అంతటితో వొదిలేశాడు.

*　　*　　*

"ఇదిగో, రామయ్యా, నన్ననవసరంగా శ్రమపెట్టక ఆ వందరూపాయల నోటు తెచ్చి రాఘవయ్య కిచ్చేసెయ్యి" అన్నాడు సబ్-ఇన్‌స్పెక్టర్.

"పరాయి సొమ్ము పూచికపుల్లయినా నే నెరగను బాబూ. నా గరానాతనం చుట్టుపక్కలోళ్లందరికీ తెల్చు."

"ఘరానా దొంగలు మాకు కొత్తకాదులే. వాదిస్తే ఫలితం శూన్యం. ఊఁ ..త్వరగా"

"ఆదారం లేకండా ఇట్టా మాట్టాడితే ఎట్టా బాబూ?"

"ఆధారాలు కావాలా? ఇదిగో దీన్ని చూశావా? దీనికన్ని ఆధారాలూ తెలుసు." అన్నాడు సబ్ఇన్‌స్పెక్టర్ లాఠీని గాలిలో ఆడించి.

"తమరట్టా మాట్టాడితే నేనేం సెప్పను? దొంగతనం మా ఇంటా, వొంటాగూడ లేదు."

"పేచీ లేకుండా ఇచ్చేస్తే కేసుపెట్టను. ఆలోచించుకో."

"నేనసలు దొంగతనం చేత్తేగదా బాబూ ఆలోచన."

సబిన్‌స్పెక్టర్ లాఠీతో నేలమీద కొట్టాడు కోపంతో. లచ్చి గుండెలు గతుక్కుమన్నాయి.

"ఏం?"

దౌర్జన్యానికి సిద్ధపడ్డ ఇన్‌స్పెక్టర్‌ని చూసి రామయ్య మరింత మొండిగా జవాబిచ్చాడు.

"నే తియ్యలేదు అంటినిగదయ్యా."

రామయ్య కాలిమడమమీద దెబ్బపడ్డది. సబ్ ఇన్‌స్పెక్టరునీ, పక్కన ఉన్న కాన్‌స్టేబిల్‌నీ మింగేసేట్టు చురచుర చూశాడు రామయ్య. లచ్చి కళ్ల వెంబడి కారే నీళ్లను ఆపుకోటానికి వ్యర్థప్రయత్నాలు చేసింది.

"ఏంది బాబూ, అన్నెం పున్నెం ఎరగనోళ్లని పట్టుకొట్టటానికేనా మీకు లాటీలు ఇచ్చింది?" అంది లచ్చి.

"మరెందుకనుకుంటవు?" అన్నాడు రామయ్య దెబ్బ తగిలినచోట తడుముకుంటూ.

"అతిగా వాగక, ఇప్పుడైనా ఆ నోటు తెచ్చి ఇస్తావా?"

"నే నెరగనో మొర్రో అంటే నమ్మరేందయ్యా?" అన్నాడు రామయ్య ఆవేశంతో.

"ఇటువంటివాళ్ళ చాలామందిచేత నిజం పలికించింది ఈ లాఠీ. నీసంగతి కూడా తెలుస్తుందిలే."

లాఠీ రామయ్య శరీరంమీద నాట్యంచేసింది. రామయ్య కోపాన్ని దిగమింగుకోటానికి ప్రయత్నిస్తూ కళ్లతో నిప్పులు కక్కాడు. ఆ దెబ్బలు చూడలేక లచ్చి ఇన్‌స్పెక్టరు దగ్గిరికి పరిగెత్తుకొచ్చి అతని చెయ్యి పట్టుకుని ఆపి అంది:

"బాబూ, ఆ వంద రూపాయల కాగితం నేనే తీశాను. ఆయన్ని కొట్టకండి." రామయ్య ఆమెవైపు ఆశ్చర్యంగా చూశాడు. ఇన్‌స్పెక్టరు విజయవంతంగా నవ్వి లాఠీని నేలమీద గర్వంగా కొట్టి అన్నాడు:

"మీ ఇద్దర్లో ఎవరు తీసినా ఒకటే. నువ్వు మొగాడివి గనక నీమీదికి దూకింది లాఠీ. ఏదీ, ఆ కాయితం తీసుకురావమ్మా, ఇంకా ఇక్కడే నిలబడ్డావు."

లచ్చి లోపలికెళ్ళి ఓ వందరూపాయల కాయితం తెచ్చి ఇన్‌స్పెక్టరు చేతికిచ్చింది. రామయ్య ఆమెవైపు వింతగా చూశాడు. లచ్చి అతనికి మాత్రమే వినబడేలా "వొడ్లమ్మిన పైకం" అంది. రామయ్య నిట్టూర్పు విడిచాడు.

ఇన్‌స్పెక్టర్ నోటు రాఘవయ్య చేతికిస్తూ పకిలించి అన్నాడు: "నీ నోటు నంబరు గుర్తుందన్నావుగా సరి పోయిందేమో చూసుకో."

రాఘవయ్య జేబులోంచి ఓ కాగితంతీసి, వందరూపాయ నోటుమీది నంబరు పోల్చిచూసి అన్నాడు.

"బాబూ, ఈ నంబరు మారిందండి."

"మారటమేమిటి? సరిగ్గా చూడవయ్యా రాఘవయ్యా" అన్నాడు కన్‌స్టేబిల్.

"సరిగ్గనే చూసినా, ఇదుగో కావలిస్తే మీరు కూడా చూడండి" అని నోటు కన్‌స్టేబిల్ చేతికిచ్చాడు రాఘవయ్య.

"ఇది దొంగిలించిన నోటు కానట్టుగుంది సార్" అన్నాడు కన్‌స్టేబిల్ అనుమానంగా, నోటు నంబరు పోల్చిచూసి.

"నీ ఖర్మం ఇంతేలే, నువ్వెన్నాళ్లు సర్వీసు చేసినా కన్‌స్టేబిల్‌వే. చివరికి హెడ్ కన్‌స్టేబిల్ కూడా కావు-వొట్టి అడుసుబుర్ర" ఇన్‌స్పెక్టర్ పెదవి విరిచి అన్నాడు.

"అదికాదు సార్" అని ఏదో దీనంగా అనబోయాడు కన్‌స్టేబిల్.

"నీ మొహం దొంగతనం చేసినవాడు పట్టుబడటానికి వీలుగా ఆనోటే ఇంట్లో దాచుకుంటాడేమిటి? అదెక్కడో మార్చేసి ఈనోటు ఇంట్లో దాచుకున్నాడు. ఈ మాత్రం గ్రహించలేనివాడివి నువ్వెందుకు పని కొస్తావు."

"బలే గ్గనిపెట్టింద్రు దొరా!" అన్నాడు రామయ్య వ్యంగ్యంగా. ఇన్‌స్పెక్టర్ మీసం దువ్వి రామయ్యవైపు కొంచెం ప్రశంసాపాత్రంగా చూసి అన్నాడు.

"ఏమి తెలుసుకున్నావురా మరి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్స్ లిస్టులో ఊరికేనే వేశారనుకున్నావేమిటి నన్ను. ఈమాత్రం కనిపెట్ట లేకపోతే నా ఇన్‌స్పెక్టర్ గిరీ ఎందుకు!"

"తమరెట్టయినా కూపీదియ్యటంలో మా గొప్పోళ్లు!" అన్నాడు రామయ్య కడుపుమంట వెళ్లబుచ్చుతూ, వ్యంగ్యంగా. లచ్చి నోటికి చీర చెంగు అడ్డంపెట్టుకుంది.

సబ్ ఇన్‌స్పెక్టర్ రామయ్యవైపు దయతో చూసి "వీణ్ని వొదిలి పెడదాంలే పాపం" అనుకున్నాడు.

"మార్చినోడు చిల్లర దీసుకురాక మళ్లీనోటు ఎందుకుపట్టుకొస్తాడు సార్!" అనాడు తన తెలివి ఎలాగైనా సబిన్‌స్పెక్టర్ గ్రహించేలా చేయాలని, కన్‌స్టేబిల్.

కన్‌స్టేబిల్ చెప్పింది సమంజసంగానే తోచినా, అది ఒప్పుకోటం తన గౌరవానికి భంగకరమని, అతనివైపు రౌద్రంగా చూచి "షటప్" అన్నాడు సబ్ఇన్‌స్పెక్టరు.

తన తెలివితేటలు మెచ్చుకొన్న రామయ్య మీద కేసు పెట్టడం ఇష్టం లేక సబ్ఇన్‌స్పెక్టరు, కాన్‌స్టేబిల్‌తో సహా వెళ్లిపోయాడు.

రాఘవయ్య గేలిగా రామయ్యవైపు చూసి అన్నాడు.

"ఈ బుద్ధి మొదటే ఉంటే ఏంచక్కగా ఉండేది. నిజం దాగుద్దీ! అందులో పోలీసోళ్ల దగ్గరా నిజందాగేది?" రామయ్య ఉక్రోషంతో తటాలున లేచి "నిజందాగదూ?" అని ఊచి పుచ్చుకు రాఘవయ్య దవడమీద ఒక్కటిచ్చుకున్నాడు. రాఘవయ్య దెబ్బకి సర్దుకునే లోపుగా రామయ్య వెళ్లిపోతున్న ఇన్‌స్పెక్టరు దగ్గిరికి పరుగెత్తికెళ్లి, రొజుతూ అన్నాడు. "చూడండి, బాబూ, దొంగతనం సేస్తావా? అని రాఘవయ్య దవడమీద ఎట్టకొట్టిండో!"

దూరంలో ఉన్న రాఘవయ్య వైపు కోపంగా చూసి అన్నాడు సబిన్‌స్పెక్టర్. "వాట్, అఫెన్స ఆఫ్ అస్సాల్ట్! మేమిక్కడ ఉండగానే! ఇన్‌సల్టింగ్ ది ఆఫీసర్స్ ఆఫ్ లా! వన్ నాట్ టూ, ఆ రాఘవయ్యని స్టేషన్‌కి లాక్కురా! కేసు పెడితే వొదుల్తుంది పొగరు."

కాన్‌స్టేబిల్ రాఘవయ్య చెప్పేదేమీ వినిపించుకోకుండా అతన్ని స్టేషన్‌వైపుకి తీసుకెళ్లాడు. కానిస్టేబిల్‌తో వెడుతున్న రాఘవయ్య వైపుచూసి, "నిజందాగదూ?" అన్నాడు రాఘువయ్య వెటకారంగా.

పిటీషనరు తరఫు లాయరు: అయితే యీ కేసులో ముద్దాయివి నీవేనా?

ముద్దాయి (అర్థం తెలియక): నేను గాదండి, మా మునసబుగోరు.

లాయరు: అయితే నువ్వెవరు?

ముద్దాయి: మా మునసబుగారు ఎండికంచాలు ఎత్తుకురమ్మంటే ఎత్తుకొచ్చినోణ్ణండి.